క్లుప్తంగా

పశుబీమాతో రైతులకు మేలు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ

నందికొట్కూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పశుబీమా పథకంతో గ్రామీణ ప్రాంతాలలోని రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పశువైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పశువులకు సంబంధించిన టీకాలు, మందులను ఎల్లప్పుడూ వైద్యశాలలో అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి మందులు, టీకాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా నాగుల పంచమి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు

వెలుగోడు: మండలంలో నాగుల పంచమి, గరుడ పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రామాలయంలో పురోహితులు మధుసూదనశర్మ, నరసరామశర్మ, కిశోర్‌శర్మలు మహిళలచే ఫణి గౌరి వ్రతం చేయించారు. అలాగే వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. నాగులకట్టల వద్ద మహిళలు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి కార్మికులతో కలిసి ఆర్టీసీ బస్టాండ్, పటేల్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోపాల్, మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు భాస్కర్, సర్వర్‌ఖాన్, మారెన్న, మస్తాన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

నందికొట్కూరు: బీసీలకు చట్టసభలో రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ నాగేశ్వరరావు యాదవ్ కోరారు. సోమవారం పట్టణంలోని గాయత్రి అమ్మవారి ఆలయంలో బీసీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమాల ఫలితంగానే బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సంక్షేమ హాస్టళ్లు, ప్రత్యేక పాఠశాలలు సాధించడం జరిగిందన్నారు.బీసీలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి, నాయకులు రామకృష్ణ, శ్రీనివాసులు, శివకిషోర్, అక్బర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలను పథకాలకు అర్హులుగా గుర్తించాలి

కొత్తపల్లి: గ్రామాల్లో పనిచేస్తున్న వీఆర్‌ఏలను ప్రభుత్వ పథకాలకు అర్హులుగా గుర్తించి, ప్రతి వీఆర్‌ఏకు ఇంటి స్థలం ఇవ్వాలని వీఆర్‌ఏల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగేష్, మండల అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి మియ్యాసా కోరారు. సోమవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో వీఆర్‌ఏలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్నకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు చెన్నయ్య పుల్లయ్య స్వాములు పలు గ్రామాల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి దంపతులకు శ్రావణమాసం, సోమవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. స్వామి,అమ్మవార్లను విశేషంగా అలంకరించి పల్లకీలో కొలువుచేసి ఆలయ ప్రాకారాల్లో ఊరేగించారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కొమరం భీం చెంచుగిరిజన సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వై.ఆశీర్వాదం ఆధ్వర్యంలో సోమవారం శ్రీశైలం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రదర్శన నిర్వహించారు. మాణిక్యమ్మసెల, పెదారుట్ల గూ డెంలో ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేపట్టలేదని, వారికి సాగు భూమిని కూడా ఇవ్వాలని కోరారు. కుడుముల వెంకటేశ్వర్లు, పి.మల్లికార్జున, ఎ.బెనహర్, వై.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దిగివచ్చిన కూరగాయల ధరలు

- సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరట
- రూ.200 నుంచి కిలో రూ.40కి పడిపోయిన టమాట
- మిర్చీ సైతం కిలో రూ.50
- దాదాపు అన్ని కూరగాయలు రూ.50 లోపే



మార్కెట్‌లోని ఓ దుకాణంలో కూరగాయలు

ఆత్మకూరు: సరిగ్గా నెలరోజుల క్రితం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు దడ పుట్టించే రీతిలో కూరగాయల ధరల భగ్గుమన్నాయి. టమాట, మిర్చి ధర ఆకాశాన్ని అంటడంతో ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఆత్మకూరు పట్టణంలో ఆదివారం సంత మార్కెట్ జరగడం ఆనవాయితీ. ఈ వారం జరిగిన సంతలో కూరగాయల ధరలు ఒక్కసారిగా దిగివచ్చాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఊరటచెందారు.

భారీగా తగ్గిన ధరలు

జూలై నెలలో ఆత్మకూరు సంతలో టమాటలు రూ.200 పలికాయి. ఇతర కూరగాయల దుకాణాల్లో ఇంకా ఎక్కువ ధరకే విక్రయించారు. పచ్చిమిర్చి ధర కూడా టమాటాకు తీసిపోని రీతిలో రిలో రూ.110 వరకు విక్రయించడంతో సామాన్యులు ఇబ్బందులు పడ్డారు. అయితే ఈ వారం టమాటా, మిర్చీతో పాటు ఇతర కూరగాయల ధరలు భారీగా తగ్గడం కొంత ఊరటనిస్తున్నాయి.

తగ్గిన కూరగాయల ధరలు ఇలా..

టమాటా కిలో క్వాలిటీని బట్టి రూ.30 నుంచి రూ.40, పచ్చిమిర్చి రూ.35 నుంచి రూ.50, ఉల్లి రూ.20 నుంచి రూ.28, బీరకాయ రూ.35, బెండ రూ.30, క్యాబేజీ రూ.45, బీట్‌రూట్ రూ.80, క్యారెట్ రూ.40, వంకాయలు రూ.35, బంగాళదుంపలు రూ.40 ధర పలికింది. ప్రస్తుతం కూరగాయల ధరలు దిగిరావడంతో సామాన్య, మధ్యతరగతి వినియోగదారులు సంబరపడుతున్నారు. ధరలు అధికంగా ఉన్నప్పుడు సేరు, పావుకేజీకి సరి పెట్టుకున్న టమాటా, పచ్చిమిర్చిని కిలో చొప్పున కొనుగోలు చేస్తున్నారు.

ధరలు తగ్గడం సంతోషంగా ఉంది



కూరగాయల ధరలు తగ్గడం సంతోషంగా ఉంది. ప్రధానంగా ప్రతి కుటుంబానికి ఉపయోగపడే టమాట, మిర్చితో పాటు ఇతర కూరగాయల ధరలు తగ్గడంతో నిరుపేదలు కూడా కొనే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం ఏ కూరగాయలు కొన్నా కిలో రూ.50 లోపే ఉండడం సంతోషంగా ఉంది. – బాషా, ఆత్మకూరు

పేదలకు అందుబాటులో కూరగాయలు



పేదలకు కూరగాయలు, నిత్యావసర వస్తువులు ధరలు దిగివచ్చాయి. ఈ వారం కూరగాయల ధరలు తగ్గడంతో సామాన్యులు, నిరుపేద ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. గతంలో టమాటా కొనాలంటే ఇబ్బంది పడేవాళ్లం. ప్రస్తుతం టమాటా, మిర్చి లాంటివి తగ్గడంతో కిలో, అరకిలో చొప్పున కొంటున్నాం. ఇతర కూరగాయలు కూడా తక్కువగానే ఉన్నాయి. – వెంకటేశ్వర్లు , ఆత్మకూరు

ఫారం ఆస్తుల జోలికొస్తే ఉపేక్షించం



చెట్టు కూల్చివేతపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఫారం ఏడీఏ అరుణలత

జూపాడుబంగ్లా: తంగడంచ ఫారం ఆస్తులను ఆక్రమించినా, ధ్వంసం చేసినా అందుకు బాధ్యులైన వారిని ఉపేక్షించేదిలేదని ఫారం ఏడీఏ అరుణలత తెలిపారు. సోమవారం ఫారం స్థలంలో ఉన్న సుమారు 20ఏళ్ల నీలగిరి వృక్షాన్ని ఎలాంటి అనుమతుల్లేకుండా కూల్చివేశారు. విషయం తెలుసుకున్న ఏడీఏ కూల్చిన చెట్టును పరిశీలించారు. ఎవరు చెట్టును కూల్చారు, మీకేమైనా అనుమతులున్నాయా అంటూ హౌసింగ్ ఏఈ జ్యోతిని ప్రశ్నించారు. చెట్టుకూల్చివేయాల్సిన అవసరం తలెత్తినప్పుడు విషయాన్ని తహసీల్దార్ లేక తమ దృష్టికి తేవాల్సి ఉండగా ఇష్టానుసారంగా చెట్టును కూల్చటం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెకలించిన చెట్టును ఎవరూ తీసుకెళ్లవద్దని సూచించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తంగడంచ ఫారం స్థలం ఆక్రమణకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందని, స్థలాన్ని త్వరలో కొలతలు వేయించి ఆక్రమణకు గురైన వాటిని వెంటనే ఖాళీ చేయించి ఫారం స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

26 నుంచి సీపీఎం శిక్షణ తరగతులు

ఆత్మకూరు: పట్టణంలో ఈ నెల 26 నుంచి నిర్వహించను్న సీపీఎం నియోకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి రణధీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సుదర్శన వర్మభవనంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌నాయక్, స్వాములు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే చర్యలు

కొత్తపల్లి: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు సెబ్ సీఐ జి.నాయుడు హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఎర్రమఠం గ్రామ శివారులోని నల్లమల్ల అటవీ ప్రాంతంలో నాటుసారా స్థావరాలపై ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది దాడులు నిర్వహించారు. దాడుల్లో సారా బట్టీని, 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 15 లీటర్ల నాటు సారా, టీవీఎస్ ఎక్సెల్ బైకును సీజ్ చేశారు. గ్రామానికి చెందిన బోయ సురేంద్రబాబు అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారని సీఐ తెలిపారు.

జగనన్న కాలనీలో రోడ్డు పనులకు శ్రీకారం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ భాస్కర్‌నాయుడు

నందికొట్కూరు: జగనన్న కాలనీలో రోడ్లు వేసేందుకు పనులు ప్రారంభించినట్లు హౌసింగ్ పీడీ భాస్కర్‌నాయుడు, మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. సోమవారం పట్టణ సమీపంలో వెలిసిన జగనన్న కాలనీల్లో మట్టి రోడ్ల పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వారు మాట్లాడుతూ ఈ నెలాఖరులోపు రోడ్లు, మంచినీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జగనన్న లే అవుట్–1లో మొత్తం గృహ నిర్మాణాలు 565కు గాను 195 పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ నెల 30వ తేదీన 30 గృహాలు గృహ ప్రవేశ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రతి ఇంటికి ఉచితంగా కుళాయి కనెక్షన్లు, ప్రతి వీధిలో మట్టి రోడ్డుతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. హౌసింగ్ పీడీ భాస్కర్‌నాయుడు, ఈఈ ఉమామహేశ్వర్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈలు అరుణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ కలాం తదితరులు పాల్గొన్నారు.

గణేశ సదనంను భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలి



ఈఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న కృష్ణ ధర్మ రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దుర్గారావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గణేశ సదనంను త్వరగా ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలి కృష్ణ ధర్మ రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె.దుర్గారావు దేవస్థాన ఈఓ లవన్నను కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దేవస్థానంలో భక్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వినతిరూపంలో దేవస్థాన ఈఓకు అందజేశామన్నారు. పాతాళగంగకు వెళ్లేందుకు గతంలో ప్రారంభించిన పుష్కరఘాట్‌ను మరింత సౌకర్యవంతంగా చేసి కార్తికమాసంలోపు మెట్ల మార్గాన్ని పునరుద్ధరించాలని కోరారు. అలాగే టీటీడీ తరహాలో ట్యాగ్‌లైన్ పద్ధతిని ప్రవేశపెట్టి భక్తులు క్షేత్రంలో ఉన్న ఆలయాలను సందర్శించే అవకాశం కలిప్ంచాలన్నారు. సాధు ట్రస్ట్ భవన్ ఏర్పాటుకు చర్యలు, ఆన్‌లైన్ టికెట్ల విధానం, దేవస్థాన భూములు తిరిగి దేవస్థానానికి చెందేలా కృషి చేసినందుకు, సామాన్య భక్తులకు మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఉచిత స్పర్శదర్శనం ప్రవేశపెట్టడంపై ఈఓను అభినందించి, శాలువా కప్పి సన్మానించారు.

వర్షం కోసం పూజలు

- పాతాళగంగ నీటితో భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు అభిషేకం



పాతాళగంగ నీటిని తీసుకొస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి



పాములపాడులో పీర్ల చావిడీ వద్ద భజన చేస్తున్న భక్తులు

నందికొట్కూరు: వర్షాలు కురవాలని పట్టణంలోని కోట వీధిలోని ఆంజనేయస్వామి గుడిలో రైతులు, భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి శ్రీశైలం పుణ్యం క్షేత్రంలోని పాతాళగంగ నీళ్లతో భ్రమరాంబామల్లికార్జున స్వామి వార్లకు అభిషేకం చేశారు. వేసిన పంటలు ఎండిపోతున్నాయి కరుణించి వరుణ దేవా అంటూ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాగులచవితి పండుగ సందర్భంగా నాగులకట్టకు మున్సిపల్ చైర్మన్ పాలు పోసి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ లక్ష్మిరెడ్డి, సభ్యులు, రైతు కమిటీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీరాములు, ఉపేంద్రారెడ్డి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరుణుడు కటాక్షించాలని ప్రార్థనలు

పాములపాడు: వరుణుడు కటాక్షించాలని కోరుతూ మండల కేంద్రంలోని పీర్ల చావిడీ వద్ద ప్రత్యేక ప్రార్థనలు, భజనలు నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా చౌడయ్య భజన బృందం, రైతులు రాత్రి వేళలో మౌలాలి స్వామిని వేడుకుంటూ వర్షం కురవాలని భజనలు చేస్తున్నారు. వర్షాలు కురవకపోవడంతో నీటి సదుపాయం లేని పొలాల్లో పైర్లు ఎండిపోతున్నాయి. పంటలు పండకపోతే కరువుతో విలవిల్లాడాల్సి వస్తుందని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుణ దేవా కటాక్షించు అని వేడుకుంటున్నారు.

బానకచెర్లలో డెంగీ కేసు నమోదు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల గ్రామంలో సోమవారం డెంగీ కేసు నమోదైనట్లు డాక్టర్ నాగలక్ష్మిదేవి తెలిపారు. షాహిద్ అనే 6 సంవత్సరాల బాలుడు ఈ వ్యాధి భారిన పడ్డాడని చెప్పా రు. ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి వెంటనే కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు ఆ అబ్బాయిని తరలించినట్లు వివరించారు. గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించామని, కేవలం ఒక్క కేసు మాత్రమే నమైదైందని తెలిపారు. ఎంపీడీఓ గోపీకృష్ణ విష యం తెలుసుకున్న వెంటనే గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ప్రతి వీధిలో బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణకు స్ప్రేయింగ్ చేయించారు.

కరువు ప్రకటించాలి

పాములపాడు: వర్షాలు కురవక పొలాల్లో పైర్లు ఎండిపోయిన పరిస్థితులు నెలకొన్నందున ప్రభుత్వం కరువు ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ కోరారు. సోమవారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కరువు ప్రకటించి పంటల నష్టాన్ని అంచనా వేయాలని, రబీ సీజన్‌కు ఎరువులు, విత్తనాలు, రైతులకు ఉచితంగా అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏసురత్నం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జిల్లా నాయకుడు రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ‘స్పందన’

నందికొట్కూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పుల్లయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చే ప్రతి సమస్యను అధికారులు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, ఏవో షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో సమస్యలు పరిష్కరించుకోండి

జూపాడుబంగ్లా: జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో ప్రజలు సమస్యలను లిఖితపూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు.

కొత్తపల్లి: గ్రామాల్లో ఏ సమస్యలేకుండా పరిష్కారం చేసేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. మండలంలో ఇద్దరు రైతులు భూములు సర్వేచేయించి కొలతలు నిర్ధారించాలని, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ముగ్గురు అర్జీలు చేసుకున్నారని చెప్పారు.

నేడు సర్వసభ్య సమావేశం

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ సోమవారం తెలిపారు. మండల ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, కో ఆప్టెడ్ మెంబర్ హాజరు కావలెనని కోరారు.

నేడు అర్బన్ మార్కెట్‌లో ‘ఆహా క్యాంటీన్’

నందికొట్కూరు: పట్టణంలో మంగళవారం నిర్వహిస్తున్న అర్బన్ మార్కెట్‌లో ఆహా క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం జైకిసాన్ పార్కులో అర్బన్ మార్కెట్‌ను మెప్మా ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పొదుపు సంఘం సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను అమ్మేందుకు ప్రదర్శిస్తారని చెప్పారు. ఆహా క్యాంటీన్‌లో కూడా సంఘ సభ్యులు తయారు చేసిన ఆహార పదార్థాలను అమ్మకానికి ఉంచుతారని తెలిపారు.

ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా చేయాలి



ఏఈ రామాచారితో వాగ్వాదం చేస్తున్న రైతులు

జూపాడుబంగ్లా: తాటిపాడు ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ రామాచారిని సోమవారం రైతులు నిలదీశారు. రెండు రోజుల నుంచి తాటిపాడు ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఆయకట్టు పొలానికి సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మోటార్లకు విద్యుత్ నిలిపివేయటం వల్లే నీటి సరఫరా నిలిచిపోయిందన్న విషయం తెలుసుకున్న తంగడంచ, తరిగోపుల, పి.లింగాపురం, తర్తూరు, జూపాడుబంగ్లా, పారుమంచాల గ్రామాల రైతులు సోమవారం జూపాడుబంగ్లా విద్యుత్ ఉపకేంద్రానికి చేరుకొని ఏఈతో మాట్లాడారు. సమస్యను జఠిలం చేయకుండా ఏఈ రామాచారి విషయాన్ని ట్రాన్స్‌కో ఉన్నతాధికారులకు వివరించారు. స్పందించిన వారు వెంటనే తాటిపాడు ఎత్తిపోతల పథకానికి విద్యుత్‌సరఫరా చేయడంతో రైతులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

నిర్ణీత వేళల్లో విద్యుత్ సరఫరా

అధిక విద్యుత్ లోడ్ కారణంగా తాటిపాడు ఎత్తిపోతల పథకానికి నిర్ణీత వేళల్లో విద్యుత్‌ను సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామాచారి, ఎత్తిపోతల పథకం కోఆర్డినేటర్ సాంబశివుడు తెలిపారు. ఉదయం 5 నుంచి 9.30 గంటల వరకు ఫేజ్ 1, 2 పథకాల కింద నాలుగు మోటార్లు రన్నింగ్ చేస్తూ రైతులకు సాగునీటిని సరఫరా చేస్తామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఫేజ్–1 కింద ఓ మోటారు, ఫేజ్–2 కింద ఓ మోటారు రన్నింగ్ చేస్తామని చెప్పారు. మధ్యాహ్నం 2.30గంటల నుంచి రాత్రి 7గంటల వరకు ఫేజ్ 1, 2 పథకాల కింద నాలుగు మోటార్లను ఆడించి ఆయకట్టు రైతులకు సాగునీటిని విడుదల చేస్తామని తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

పాములపాడు: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సోమవారం రాత్రి పాములపాడు, ఎర్రగూడూరు, కంబాలపల్లి రైతులు ముట్టడించారు. ఇష్టానుసారంగా కరెంట్ కోతలు విధించడం వలన పొలాలకు నీరు పారించలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ స్టేషన్ వద్ద ధర్నాకు దిగడంతో హుటాహుటీనా ఏడీఏ వసంతయ్య సబ్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. రైతులతో మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ అందించేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నామని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి నిరంతరాయంగా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు నాగేశ్వరరెడ్డి, గోవిందు, సాయికృష్ణ, శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాభై ఏళ్లుగా పాదయాత్రగా మహానందీశ్వరుడి చెంతకు..



మహానందిలో భజనలు చేస్తున్న మామిళ్లకుంట వాసులు

మహానంది: కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి మండలంలోని మామిళ్లకుంట గ్రామానికి చెందిన సుమారు నలభై మంది సోమవారం పాదయాత్ర ద్వారా మహానంది వచ్చారు. అనంతరం వారు స్వామి,అమ్మ వారి చెంత భక్తిగీతాలు ఆలపిస్తూ భజనలు చేసి దర్శించుకున్నారు. ఇక్కడి కోనేరులోని జలాన్ని ప్రత్యేక కలశంలో తీసుకెళ్లారు. భజనమండలి సభ్యుడు వెంకటేశ్వర్లు, రాముడు, వేణు మాట్లాడుతూ మహానంది కోనేరులోని గంగమ్మను తీసుకెళ్లి మా గ్రామంలోని ఆలయాల్లో అభిషేకం పూజలు చేస్తామని, తప్పకుండా వర్షాలు కురుస్తాయని చెప్పారు. అందరూ బాగుండాలన్న సంకల్పంతో గత యాభై ఏళ్లుగా మహానందికి వస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా వారిలో సుమారు అరవై నుంచి డెబ్బై ఏళ్ల వయసున్న వారు ఉండటం విశేషం.

నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

వెలుగోడు: మండలంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మొబైల్ ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ అమానుల్లా తెలిపారు. 22న అబ్దుల్లాపురం, 23న మోతుకూరు, 24న వెలుగోడు సచివాలయం–2, 25న వెలుగోడు–4 సచివాలయం పరిధిలో ఆధార్ మొబైల్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాతం ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మొబైల్ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పగిడ్యాల: మండల వ్యాప్తంగా ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు సచివాలయాల్లో మొబైల్ ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణ కోరారు. 22న పగిడ్యాల–2, పాత ముచ్చుమర్రి, 23న పగిడ్యాల–3, లక్ష్మాపురం –3, 24న నెహ్రూనగర్–2, లక్ష్మాపురం–1, 25న నెహ్రూనగర్–2, లక్ష్మాపురం–2 సచివాలయాల్లో క్యాంప్‌లు ఉంటాయని వెల్లడించారు.

మహానంది: బండిఆత్మకూరు మండలంలో మంగళవారం నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. 22న భోజనం, బండిఆత్మకూరు, చిన్నదేవళాపురం, 23న పెద్దదేవళాపురం, బి.కోడూరు, నారాయణాపురం, 24న ఏ.కోడూరు, కడమలకాల్వ, జి.లింగాపురం గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తారన్నారు. 25న పార్నపల్లె, యర్రగుంట్ల గ్రామాల్లో ఉంటుందన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) శ్రీశైలంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి మూడవ విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎ.రవీంద్రబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాలు ఫిట్టర్, టర్నర్, మెకానిక్ మోటర్ వెహికల్, ఒక సంవత్సరం వెల్డర్ ట్రేడ్లలో సీట్లు మిగిలి ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 27 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్ కౌన్సెలింగ్ ఈ నెల 30న స్థానిక ఐటీఐలో ఉంటుందన్నారు. వివరాలకు 9705683537 , 9502722811లకు సంప్రదించాలన్నారు.

ఉమా మహేశ్వరాలయంలో పూజలు



ఉమామహేశ్వరాలయంలో రుద్రహోమం చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: సంగమేశ్వరంలో ఎగువన ఉన్న ఉమామహేశ్వరాలయంలో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో నిజశ్రావణమాసం తొలి సోమవార పూజలు నిర్వహించారు. ఆలయంలో శివ లింగానికి సప్తనదిజలాలతో అభిషేకములు, కుంకుమార్చన, పుష్పార్చన మంగళహారతి, రుద్రహోం నిర్వహించారు.

గురుకుల పాఠశాలల తనిఖీ

శ్రీశైలంప్రాజెక్ట్: పాణ్యంలోని బాలికల గురుకుల పాఠశాల, మినీ గురుకులాను సోమవారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి.రవీంద్రారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లోని డిజిటల్ క్లాస్ రూంలో విద్యా బోధనను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారపదార్థాలను రుచి చూశారు. మరుగుదొడ్ల నిర్వహణ, రన్నింగ్ వాటర్, వసతిగృహంలో లోపాలను గమనించి అసహనం వ్యక్తం చేశారు. డార్మిటరీలో దోమలు రాకుండా విండోమెష్‌లను ఏర్పాటు చేయాలన ఆదేశించారు. ప్రహరీ నిర్మాణానికి డైరెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు.

కుక్కల స్వైర విహారం

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని అయ్యవారి కోడూరులో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటుగా వెళ్లే ప్రయాణికులు సైతం బెంబేలెత్తుతున్నాయి. స్థానిక పెట్రోల్ బంక్, బస్టాండు ప్రాంగణాల్లో సోమవారం ఒకేరోజు ఎనిమిది మంది కుక్కకాటుకు గురైనట్లు స్థానికులు తెలిపారు.

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణోత్సవం



కల్యాణం పూజలందుకున్న మహానందీశ్వరుడు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగా, కామేశ్వరీదేవి మహానందీశ్వరస్వామి వార్లకు శ్రావణ మాసం, సోమవారం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అలంకార మండపంలో పండితులు, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజలు, అక్షింతల సమర్పణ, మాంగళ్య ధారణ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

మహానందిలో కొనసాగుతున్న భక్తజనసందడి

మహానంది పుణ్యక్షేత్రంలో భక్తులరద్దీ కొనసాగుతోంది. సోమవారం వేకువజాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. సుమారు యాభైకిపైగా అభిషేకాలు జరిగాయి. స్వామి,అమ్మవారి దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది. వేకువజామున ప్రారంభమైన స్వామి,అమ్మవారి దర్శనం రాత్రి ఏకాంత సేవ వరకు నిర్విరామంగా కొనసాగింది.

బానుముక్కలలో ట్యాంకర్లతో నీటి సరఫరా



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న కాలనీ వాసులు

పాములపాడు: మండలంలోని బానుముక్కల గ్రామంలో ఆదివారం నుంచి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. 20 రోజుల క్రితం వెలుగోడు నుంచి సరఫరా కావాల్సిన నీరు నిలిచిపోయింది. పైపు లైను మరమ్మతులకు గురికావడంతో ఈ పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ గోపీకృష్ణ.. సర్పంచు కృష్ణవేణితో మాట్లాడి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే పంచాయతీ కార్యదర్శి నాగార్జునరెడ్డిని ఆదేశించారు. వెంటనే గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీలకు ట్రాక్టర్ ట్యాంకుల ద్వారా కాలనీలకు నీటిని సరఫరా చేయించారు. పైపులైన్‌కు వెంటనే మరమ్మతులు చేయించాలని, ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా ఎప్పటి కప్పుడు చర్యలు తీసుకుంటామని తెలిపారు.